క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ



ధర్మరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి

భీమవరం అర్బన్‌: దిరుసుమర్రు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకులు గొట్టుముక్కల సత్యనారాయణరాజు (ధర్మరాజు)ను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ సోమవారం పరామర్శించారు. ధర్మరాజు ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న పిదప ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ అనారోగ్యానికి గల కారణాలు ధర్మరాజును అడిగి తెలుసుకుని ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పరామర్శించిన వారిలో రాజు వేగేశ్న ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు వేగేశ్న ఆనంద రాజు, రాఘవరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, గొట్టుముక్కల పద్మరాజు, లక్ష్మీ పతిరాజు, పట్టణ కన్వీనర్‌ తోట భోగయ్య, జేసీఎస్‌ మండల కన్వీనర్‌ కోమటి రాంబాబు తదితరులు ఉన్నారు.

విశ్వకవికి నివాళి



విశ్వకవి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని విశ్వకవి రవీంద్రనాథ్‌ ఠాగూర్‌ వర్ధంతిని విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్‌ హాస్టల్స్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ ముట్టపూడి సత్యనారాయణ విశ్వకవి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలో మొట్టమొదటగా నోబెల్‌ బహుమతిని అందుకున్న వ్యక్తి రవీంద్రనాథ్‌ ఠాగూర్‌ అన్నారు. ఠాగూర్‌ స్వాతంత్ర్యోద్యమంలో తన రచనల ద్వారా ఉద్యమ స్ఫూర్తిని నింపి దేశభక్తిని ప్రేరేపించారని కొనియాడారు. అల్లు శ్రీనివాస్‌, ఆరవల్లి సుబ్రహ్మణ్యం, ఇందుకూరి శివాజీవర్మ, సిగ్మ స్కూల్‌ డైరెక్టర్‌ హరిసింగ్‌, పాపోలు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం దుర్మార్గం

సాక్షి, భీమవరం: అమరావతి రైతులు చంద్రబాబును నమ్ముకుంటే సర్వనాశనమైనని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్‌ అండ్‌ మోనటరింగ్‌ సెల్‌ జిల్లా సభ్యుడు బీకేబిఎస్ మంగరాజు అన్నారు. సోమవారం భీమవరం విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తే పేదల ఇళ్ల నిర్మాణాన్ని కోర్టుకు వెళ్లి అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి రైతులకు రుణమాఫీ చేసిన సమయంలో అమరావతి రైతులు కూడా లబ్ధిపొందారని, ఆయనుండే సమయంలో రుణమాఫీ వద్దంటూ చంద్రబాబు కోర్టుకు వెళ్లలేదని మంగరాజు ప్రశ్నించారు. పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న తెలుగుదేశం పార్టీకి రానున్న ఎన్నికల్లో వారే తగిన బుద్ధి చెబుతారని మంగరాజు హెచ్చరించారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెంపు

భీమవరం అర్బన్‌: అప్పుడే పుట్టిన శిశువుకు గంటలోపు తల్లిపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సర్పంచ్‌ బూరబత్తుల రామ్మూర్తి అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ మాట్లాడుతూ కొంతమంది తల్లులు బిడ్డకు పాలిస్తే ఆరోగ్యం పాడవుతుందని, అందంక్షీణిస్తుందని పోతపాలు పడుతున్నారన్నారు. ఇది అపోహని, తల్లిపాలలో ఎన్నో పోషక గుణాలున్నాయని, బిడ్డకు టైఫాయిడ్‌, మలేరియా, కామెర్లు వంటివి రాకుండా అడ్డుకుంటాయన్నారు. తల్లి పాలు ప్రాముఖ్యతను వివరించారు. మండల పరిషత్‌ కో–ఆప్షన్‌ సభ్యుడు బల్లా కాంతారావు పాల్గొన్నారు.

వెల్లటూరులో..

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని సెక్టార్‌ సూపర్‌వైజర్‌ పి.వరలక్ష్మి అన్నారు. వెల్లటూరులో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

9న దిష్టిబొమ్మల దహనం

సాక్షి, భీమవరం: క్విట్‌ ఇండియా ఉద్యమ సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 9న జిల్లా కేంద్రం భీమవరంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ఈ నెల 9న దేశ, ప్రజా సంపద ఉద్యమ హక్కుల మోదీ, మతోన్మాద దిష్టిబొమ్మలను దహనం చేయనున్నట్లు కేవీపీఎస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన మతోన్మాద ఆజెండాను శరవేగంగా అమలు చేస్తోందని, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ మత ఘర్షణలను మరింత పెంచుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమానికి దళిత, గిరిజన, క్రైస్తవ, ప్రజా సంఘాలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని క్రాంతిబాబు కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగన్‌ పాలన

- డీసీసీబీ చైర్మన్‌ పీవీఎల్‌ నర్సింహరాజు
- దొడ్డనపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం



దొడ్డనపూడిలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న పీవీఎల్‌

కాళ్ల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్‌ పీవీఎల్‌ నర్సింహరాజు అన్నారు. దొడ్డనపూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామంలో సంక్షేమ పథకాలు అందుకుంటూ ఆనందంగా ఉన్న మహిళలంతా పీవీఎల్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల వారీగా అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని వారికి వివరించి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పిల్లలు పేద, మధ్య తరగతి పిల్లలు కూడా కార్పొరేట్‌ స్థాయిలో విద్యను అభ్యసించగలుగుతున్నారన్నారు. రాష్ట్ర ఆదాయం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలతో ఆనందంగా ఉంటున్న సమయంలో ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై బురద చల్లాలనే ఉద్దేశంతో చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడంటూ కార్యక్రమం చేపట్టారని, అది వైఫల్యం చెందడంతో మళ్లీ ప్రజలకు ఏదో చేస్తామంటూ కాగితాలు తీసుకుని ఊళ్లంతా తిరుగుతున్నారని విమర్శించారు. కానీ ప్రజలు ఇవేవీ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు 2014లో 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా పరిపాలన చేశాడని విమర్శించారు. తెలుగుదేశం పార్టీలో ఒక్క పేదవాడికి కూడా ఇల్లు లేదా ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వాలనే ఉద్దేశంతో 32 లక్షల పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత ఆయన ఒక్కరికే దక్కుతుందన్నారు. దొడ్డనపూడి గ్రామం గతంలో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉండేదని, కానీ నేడు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ సంక్షేమ పథకాలతో సంతృప్తి చెందిన ప్రజలు వైఎస్సార్‌ సీపీకి పట్టం కట్టేలా మాట్లాడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఖచ్చితంగా దొడ్డనపూడిలో వైఎస్సార్‌ సీపీ మెజార్టీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పేద వర్గాలతో పాటు కాపులకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ ఒక్కరేనని చెప్పారు. దొడ్డనపూడిలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కారాన్ని కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. గ్రామంలో ఏ ఇంటికి వెళ్లినా సంక్షేమ పథకాలు పొందుతూ మహిళలంతా ఆనందంగా ఉన్నారన్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, పేద విద్యార్థులు చదువులకు అమ్మఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, వంటి పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. ముందుగా గ్రామంలో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన జెండా స్తూపం వద్ద జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగొళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, కాళ్ల సొసైటీ అధ్యక్షుడు సుంకర భోగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు యుద్ధంశెట్టి కాశీ జగన్నాథం, గుండా సాయి, కొల్లి వెంకటరామకృష్ణ, చెన్నంశెట్టి దేవప్రసాద్‌, కొల్లి సూర్యసుబ్బారాయుడు, కొల్లి వెంకటసుబ్బారావు, కొల్లి తారక రంగారావు, ఆరేటి రంగారావు, ఎస్‌.శ్రీకాంత్‌, పల్లికొండ నవీన్‌, చిన్నం యోహాను, పుప్పాల పండు, గుండు నాగేశ్వరరావు, పెన్మెత్స రంగరాజు, బొర్రు అబ్బారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

22 వేల డస్ట్‌బిన్లు వచ్చాయ్‌



మండలానికి వచ్చిన డస్ట్‌బిన్‌లు

వీరవాసరం: పారిశుధ్య సక్రమ నిర్వహణకు ఇంటింటికి డస్ట్‌బిన్‌ పంపిణీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్టు ఎంపీడీవో కే జ్యోతి సోమవారం చెప్పారు. వీరవాసరం మండలానికి సంబంధించి 22వేల డస్ట్‌బిన్‌ కిట్లు స్వచ్ఛభారత్‌ పథకంలో భాగంగా మండల కేంద్రానికి వచ్చాయన్నారు. ఆకుపచ్చ, నీలం రంగు ఉన్న డస్ట్‌బిన్‌లలో తడి, పొడి చెత్తగా విభజించి వేర్వేరు డస్ట్‌బిన్‌లలో వేసేలా ప్రత్యేక ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. డస్ట్‌బిన్‌ ద్వారా సేకరించిన చెత్తను గ్రీన్‌ అంబాసిడర్‌ల ద్వారా చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తామన్నారు. మొదటి విడతగా వచ్చిన ఈ డస్ట్‌బిన్‌లను ప్రతి గ్రామానికి అందజేస్తామని వివరించారు.

స్పందనలో 5 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేసినట్టు వివరించారు.

జగన్‌ పాలనలో పేదలకు ప్రాధాన్యత

కలవపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పీవీఎల్‌, వెంకటరమణ



పీవీఎల్‌ నర్సింహరాజు, త్రిసభ్య కమిటీ సభ్యులను సత్కరించిన దృశ్యం

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పేదవర్గాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని డీసీసీబీ చైర్మన్‌ పీవీఎల్‌ నర్సింహరాజు, నర్సాపురం మున్సిపల్‌ చైర్మన్‌ బర్రె శ్రీవెంకట రమణ అన్నారు. కలవపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం సొసైటీ వద్ద సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పీవీఎల్‌, శ్రీవెంకటరమణ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా బర్రె గంటయ్య, సభ్యులుగా పెనుమత్స దుర్గాప్రసాద్‌రాజు, యళ్ల నందమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌ పాలనలో బడుగు బలహీనవర్గాలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. బీసీలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచనతో సొసైటీలలో, మార్కెట్‌ యార్డుల్లో పదవులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. కలవపూడి గ్రామ పరిధిలో ఎక్కువ శాతం డి.పట్టా భూములే ఉన్నప్పటికీ రైతుల ఇబ్బంది పడకుండా సొసైటీ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. అంతేకాకుండా జెడ్పీ, మండల పరిషత్‌ నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. మోడీ గ్రామానికి చెందిన ఆగ్నికుల క్షత్రియులు అయినా బర్రె గంటయ్యకు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌ పదవి ఇచ్చి ఆ వర్గానికి పెద్దపీట వేశామన్నారు. వైఎస్‌ జగన్‌ వెంట పేదలు ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కలవపూడి సొసైటీని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పీవీఎల్‌ నర్సింహరాజు, శ్రీవెంకటరమణలను కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు గజమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అప్పటివరకు త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పనిచేసిన పెనుమత్స దుర్గా ప్రసాదరాజును, ప్రస్తుత చైర్మన్‌గా ఎన్నికైన బర్రె గంటయ్య, సభ్యులను యళ్ల నందమ్మను పూలమాలతో సత్కరించారు. సరిపాలాను స్థలదాత బొండరాజును సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగొళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, పార్టీ మండల అధ్యక్షుడు గణేష్న రాంబాబు, సొసైటీ సీఈవో కనుమూరి నరసింహరాజు, మంతెన చిన్న నరసింహరాజు, బర్రె జయరాజు, ముదుండి శ్రీనివాసరాజు, తోటకూర చిన్న, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి దాతల సహకారం భేష్‌



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు విరాళం అందిస్తున్న దాతలు

సాక్షి, భీమవరం: ఆధ్యాత్మిక కేంద్రంగా భీమవరం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ అన్నారు. భీమవరం రెండో పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం (సుబ్బారాయుడు గుడి) ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. గన్నాబత్తుల, కాకులపాటి వారి కుటుంబాలు కలిసి ఈ ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళాన్ని సోమవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ చేతుల మీదుగా ఆలయ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని, రూ.10 లక్షలు విరాళాలను ఇచ్చిన ఈ రెండు కుటుంబాలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. అంతేకాకుండా వన్‌టౌన్‌లో పురాతన దేవాలయం శ్రీసీతారామ లింగేశ్వర స్వామి, కొమరాడలో శివాలయం, నవుదూరులో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణాలకు, అలాగే మరికొన్ని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేసిందన్నారు. ప్రతి ఆలయంలో అన్ని సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి దాతకూ కృతజ్ఞతలు తెలుపుకుంటుమని, మరింత మంది దాతలు ఇలాగే స్పందించాలని కోరారు. రూ.10 లక్షల విరాళం ఇచ్చిన వారిలో గన్నాబత్తుల నాగ వెంకట బాల లక్ష్మీ ఛాయాదేవి పేరున ఆమె భర్త గన్నాబత్తుల శ్రీనివాస్‌, గోవిందరావు, సీనా దంపతుల పేరున ఆమె కుమార్తె పద్మిని, గంధం రంగనాయకులు, సీరం సూర్యనారాయణమూర్తి (అమెరికా), కాకులపాటి రాధాకృష్ణ, దలవాటి, వీర రాఘవులు, రామకృష్ణ, అప్పన వెంకటేశ్వరరావు ఉన్నారు. గ్రంధి షణ్ముఖ శ్రీనివాస్‌, ఎండోమెంట్‌ ఇన్స్‌పెక్టర్‌ వర్ధిరెడ్డి వెంకటేశ్వరరావు, ఈవోలు దండు కృష్ణంరాజు, తోట శ్రీనివాస్‌, ఆలయ ధర్మకర్త నిమ్మల బాలసుబ్రహ్మణ్యం, భక్తులు గన్నాబత్తుల శేషు, గుండు రమణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య వర్తక సంఘాన్ని బలోపేతం చేయాలి

పట్టణంలోని ఆర్యవైశ్య వర్తక సంఘం (త్యాగరాజ భవనం) కు నూతన కమిటీ ఏర్పడింది. అధ్యక్షులుగా వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా తటవర్తి బదిరీ నారాయణ ఎన్నికయ్యారు. సోమవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో నూతన కమిటీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ మర్యాదపూర్వకంగా కలిసింది. నూతన కమిటీని అభినందించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు ఏపీఎస్‌ బళాలి, వరుపూరి నాగేశ్వరరావు, తటవర్తి కృష్ణప్రసాద్‌, బొండా రామ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా సీఎం జగన్‌



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న చేనేత సంఘం నాయకులు

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో చేనేత కార్మికులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో చేనేత సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల కష్టాలను మొదట గుర్తించింది ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మాత్రమేనని అన్నారు. వైఎస్‌ జగన్‌ సుదీర్ఘ పాదయాత్రలో చేనేత కార్మికుల కష్టాలను తెలుసుకున్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత వారికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకంలో రూ.24 వేలను ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంఘం అధ్యక్షులు తుమ్మ శివప్రసాద్‌, కార్యదర్శి శ్రీనివాస్‌, జాయింట్‌ సెక్రటరీ కట్లా లక్ష్మణ్‌ స్వామి, దొడ్డి శ్రీనివాస్‌, ఏలూరు శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

కొత్త వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



చిలుకూరులో వలంటీర్లకు నియామక పత్రాలు అందిస్తున్న సర్పంచ్‌ వెంకటసోమరాజు

ఉండి: ప్రజాసంక్షేమానికి కట్టుబడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ప్రతిఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందించే వారధులు వలంటీర్లు అని వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకుడు, చిలుకూరు సర్పంచ్‌ ముదునూరి వెంకటసోమరాజు అన్నారు. గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలో రెండు స్థానాల్లో వలంటీర్లుగా ఎంపికైన ఇద్దరికి నియామక పత్రాలను సర్పంచ్‌ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సాతిరాజు, వీఆర్వో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఆకివీడు: గ్రామ పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న సర్పంచ్‌, వార్డు సభ్యుల ఉప ఎన్నికకు మంగళవారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్టు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. మండలంలోని కుప్పనపూడిలో 2, 7 వార్డుల సభ్యుల పదవులకు, అజ్జమూరులోని 10వ వార్డు సభ్యుడి పదవికి ఎన్నిక జరుగనుందని తెలిపారు. 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 14న ఉపసంహరణ, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారని చెప్పారు. 19న పోలింగ్‌, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్‌ జరుగుతుందని, అదేరోజు ఫలితాలు విడుదల చేస్తామని ఎంపీడీఓ వివరించారు.

19న వార్డు సభ్యుల ఎన్నికకు పోలింగ్‌

వీరవాసరం: మత్స్యపురి, మెంటేపూడి గ్రామంలోని వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్‌ వెలువడిందని ఎంపీడీవో కే జ్యోతి సోమవారం తెలిపారు. మత్స్యపురి, ఒకటో వార్డు, మెంటేపూడి మూడో వార్డుకు ఎన్నిక జరుగనుందని తెలిపారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో నామినేషన్ల ప్రక్రియ, 11న పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, 19న పోలింగ్‌ నిర్వహిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని ఎంపీడీవో వివరించారు.

గొల్లలకోడేరు 6వ వార్డుకు..

పాలకోడేరు: గొల్లలకోడేరు పంచాయతీ ఆరో వార్డు సభ్యుడి పదవికి ఈ నెల 19న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మూర్తి గంగాధరరావు మంగళవారం చెప్పారు. 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ నెల 19న పోలింగ్‌ నిర్వహించి, అదే రోజు ఫలితాలు విడుదల చేస్తామన్నారు.

ఓటరు సర్వేలో అప్రమత్తంగా ఉండాలి

సాక్షి, భీమవరం: ఓటరు సర్వేలో బూత్‌ లెవెల్‌ ఆఫీసర్స్‌ (బీఎల్వో)లు అప్రమత్తంగా ఉండాలని భీమవరం ఆర్డీవో దాసి రాజు అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన బీఎల్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నిచోట్ల ఒకే వీధిలో అనేక ఇళ్లకు ఒకే ఇంటి నెంబర్‌ ఉంటుందని, అందువల్ల ఒకే ఇంటి నంబర్‌లో ఎక్కువ ఓట్లు ఉన్నందున ఆయా ఇళ్లకు నోషనల్‌ నంబర్లు ఇచ్చి ఓటును నమోదు చేయాలన్నారు. ఓటరు సర్వేకు వెళుతున్న బీఎల్వోలను కొన్నిచోట్ల అపార్ట్‌మెంట్‌ యజమానులు అడ్డుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. బీఎల్వోలు సర్వే సమయంలో తప్పని సరిగా ఐడీ కార్డుతో వెళ్లాలని ఆదేశించారు. ఐడీ కార్డుతో వెళ్లిన బీఎల్వోలను అడ్డుకుంటే చర్యలు తప్పవని ఆర్డీవో రాజు హెచ్చరించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్‌: భీమవరం రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో సోమవారం ఓ బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. లోసరి పంచాయతీలోని గరవదిబ్బ గ్రామానికి చెందిన 16 ఏళ్ల వయస్సున్న ఓ బాలిక అప్పనవీడులో ఇంటర్‌ చదువుతోంది. ఈ నెల 4న సాంతూరికి వచ్చింది. సోమవారం ఉదయం నుంచి బాలిక కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాదాత రామకృష్ణమ్మకు నివాళి

వీరవాసరం: విద్యాదాత మద్దాల రామకృష్ణమ్మ 33వ వర్ధంతి సందర్భంగా సోమవారం వీరవాసరం తూర్పు సెంటర్లో ఉన్న రామకృష్ణమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వీరవాసరం పరిసర ప్రాంత ప్రజలకు విద్యాభివృద్ధి కలగాలని సదుద్దేశంతో రూ.కోట్లు విలువ గల భూములను కళాశాల స్థాపనకు దానం చేసిన గొప్ప దాత రామకృష్ణమ్మ అని కొనియాడారు. కరెళ్ల విజయలక్ష్మి నరసింహం, మద్దాల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

చేనేత వృత్తిదారులను ఆదుకోవాలి

సాక్షి, భీమవరం: చేనేత వృత్తిదారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల దేనని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా బౌసింగ్‌ బోర్డ్‌ కాలనీలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఎం.సీతారాంప్రసాద్‌, చెల్లబోయిన రంగారావు, న్యాయవాది ఎం.శ్రీనివాసరావు, కలిశెట్టి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆజాదీకా అమృత్‌ కార్యక్రమాలు

ఆకివీడు: ప్రజల్లో దేశభక్తిని ప్రేరేపించేందుకు, వారిని ఉత్తేజపరిచేందుకు, ఆజాదీ కా అమృత్‌ మహోత్సవ్‌ కార్యక్రమాన్ని బుధవారం నుంచి నిర్వహించనున్నట్టు నగర పంచాయతీ కమిషనర్‌ జీ.కృష్ణమోహన్‌ సోమవారం తెలిపారు. 9న శిలాఫలకాన్ని దేశానికి అంకితమివ్వడం, 10వ తేదీన పంచ ప్రాణ ప్రతిజ్ఞ, 11న వసుధకు వందనం (మొక్కలు నాటడం), 14న వీరులకు వందనం, 15న తేదీన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు జరుగున్నాయని చెప్పారు. కార్యాలయ ఆవరణలోను, సచివాలయాల వద్ద జరిగే ఆయా కార్యక్రమాలకు నగర పంచాయతీ చైర్‌పర్సన్‌ జామి హైమావతి అధ్యక్షతవహిస్తారని, కౌన్సిలర్లు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఓపెన్‌ స్కూల్‌ విద్య సువర్ణావకాశం

నరసాపురం రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్‌ స్కూల్‌) ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్‌ విద్యను కొనసాగించేం దుకు అవకాశం కల్పించిందని భీమవరం ఉపవిద్యాశాఖాధికారి డి శ్రీరామ్‌, ఓపెన్‌ స్కూల్‌ జిల్లా కో ఆర్డినేటర్‌ ఈ నారాయణ అన్నారు. నరసాపురంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒకసారి ఓపెన్‌ స్కూల్లో చేరిన వారు ఆరేళ్లలోపు ఈ కోర్సును పూర్తి చేసే అవకాశం ఉందని డిప్యూటీ డీఈవో శ్రీరామ్‌ అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో పిల్లి పుష్పరాజ్యం, సచివాలయ సిబ్బంది, సీఆర్‌పీ ప్రయాగ, విద్యార్థులు పాల్గొన్నారు.

గద్దర్‌ మృతి తీరని లోటు

వీరవాసరం: ప్రజా గాయకుడు గద్దర్‌ మృతి తీరని లోటని మండల మాలమహానాడు అధ్యక్షుడు తాడి రాజశేఖర్‌ అన్నారు. సోమవారం వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లో గద్దర్‌ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ప్రజా సమస్యలను పాటల రూపంలో ఉద్యమాలు, పోరాటాలను చేస్తూ ప్రజాభివృద్ధికి నిత్యం కృషి చేసిన గద్దర్‌ మహనీయుడని కీర్తించారు.

సబ్‌ కలెక్టర్‌ కార్యాలయానికి 26 అర్జీలు

నరసాపురం రూరల్‌: నరసాపురం సబ్‌ కలెక్టర్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 26 అర్జీలు అందాయి. డివిజన్‌ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి పలు సమస్యలపై వచ్చిన అర్జీలను ఏవో ఏడిద శ్రీనివాస్‌ స్వీకరించారు.

నేడు దొడ్డనపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం

కాళ్ల: దొడ్డనపూడి గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు నిర్వహించనున్నట్టు డీసీసీబీ చైర్మన్‌ పీవీఎల్‌ నర్సింహరాజు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు.